క్లుప్తంగా

ఆస్పత్రికి వెళ్లి.. పింఛన్ అందించి..



వీరలక్ష్మికి పింఛన్ అందిస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్ ఉష, వలంటీర్ తేజ

రాజోలు: దూర ప్రాంతంలో చికిత్స పొందుతున్న వృద్ధురాలికి పింఛన్ అందజేసి ఆదర్శంగా నిలిచారు వేగివారిపాలెం గ్రామ వెల్ఫేర్ అసిస్టెంట్ ఉష, వలంటీర్ తేజ. వేగివారిపాలేనికి చెందిన ఆకుమర్తి వీరలక్ష్మి దీర్ఘకాలిక వ్యాధితో బాధ పడుతూ పశ్చిమ గోదావరి జిల్లా నర్సాపురంలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. చికిత్స కోసం కొంతకాలం ఆస్పత్రిలోనే ఉండాల్సిన పరిస్థితి. దీంతో ఈ నెల పింఛను తీసుకునేందుకు ఆమె గ్రామానికి రాలేకపోయింది. ఆమె పరిస్థితి తెలుసుకున్న వెల్ఫేర్ అసిస్టెంట్ ఉష, వలంటీర్ తేజ గురువారం వేగివారిపాలెం నుంచి మోటార్ సైకిల్‌పై నర్సాపురం వెళ్లి, వీరలక్ష్మికి దివ్యాంగ పింఛను రూ.3 వేలు అందజేశారు. వారిని ఎంపీడీఓ ఎస్.బాలాజీ, పంచాయతీ కార్యదర్శి మైథిలి అభినందించారు.

ల్యాండ్ కన్వర్షన్ ఉత్తర్వులు ఆర్‌డీఓ నుంచే పొందాలి



ల్యాండ్ కన్వర్షన్‌పై ఆర్‌డీఓకు వివరణ ఇస్తున్న రైతులు

కొత్తపేట: వ్యవసాయ భూమి.. వ్యవసాయేతరంగా (ల్యాండ్ కన్వర్షన్) మార్పు జరిగినట్టు ఆర్‌డీఓ నుంచి పొందిన ఉత్తర్వులే చెల్లుబాటు అవుతాయని స్థానిక ఆర్‌డీఓ ఎం.ముక్కంటి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వన్ టైం సెటిల్‌మెంట్ స్కీమ్ ద్వారా ల్యాండ్ కన్వర్షన్‌కు మీ–సేవ లేదా గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకొన్న ప్రతివారికీ రశీదు మాత్రమే ఇస్తారని స్పష్టం చేశారు. దాని ద్వారా ల్యాండ్ కన్వర్షన్ జరిగినట్టు కాదని పేర్కొన్నారు. ఇప్పటి వరకూ ల్యాండ్ కన్వర్షన్‌కు దరఖాస్తు చేసుకున్న వారు, వ్యవసాయేతర భూమిగా మార్పు జరగని వారు తమ అభ్యంతరాలను తనను స్వయంగా కలిసి రాతపూర్వకంగా వివరణ ఇవ్వాలని సూచించారు. ఇప్పటికే ఈవిధంగా తనను కలిసిన రైతులు, భూ యజమానులు విజ్ఞాపనలను పునఃపరిశీలన చేసి సమగ్ర నివేదికలు పంపాల్సిందిగా తహసీల్దార్లను ఆదేశించామని ముక్కంటి తెలిపారు.

నిత్యానదానానికి రూ.10 వేల విరాళం



దాతకు స్వామి చిత్రపటం అందజేస్తున్న ఆలయ ఉద్యోగులు

మామిడికుదురు: అప్పనపల్లి శ్రీ బాలబాలాజీ స్వామి వారి నిత్యాన్నదానం ట్రస్టుకు అమలాపురానికి చెందిన నాగాబత్తుల రత్నకుమారి, ఆమె కుమారుడు రామ్‌జీ గురువారం రూ.10,116 విరాళం సమర్పించారు. రత్నకుమారి భర్త వెంకటరావు స్మారకార్థం ఈ విరాళం అందజేశారు. ఈ మొత్తాన్ని ఆలయ కార్యనిర్వహణాధికారి ఎంకేటీ నాగ వరప్రసాద్, ధర్మకర్తల మండలి చైర్మన్ చిట్టూరి రామకృష్ణకు అందించారు. దాతకు స్వామి వారి చిత్రపటం, ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టుబోర్డు సభ్యుడు చిట్టాల సత్తిబాబు, ఉప ప్రధానార్చకుడు మద్దాలి తిరుమల శింగరాచార్యులు పాల్గొన్నారు.

5న షూటింగ్ బాల్ జిల్లా జట్ల ఎంపిక

రావులపాలెం: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పురుషులు, మహిళల షూటింగ్ బాల్ జిల్లా జట్ల ఎంపిక ఈ నెల 5న స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహిస్తున్నారు. ఈ విషయాన్ని షూటింగ్ బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి సతీష్‌బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు ఆ రోజు మధ్యాహ్నం 2 గంటలకు ఆధార్ కార్డు, జనన ధ్రువపత్రంతో హాజరు కావాలని సూచించారు. వివరాలకు 93978 56767, 93922 91234 నంబర్లలో సంప్రదించాలని కోరారు. ఎంపికైన జట్లు ఈ నెల 10 నుంచి 12వ తేదీ వరకూ హనుమాన్ జంక్షన్ వద్ద బాపునపాడు జెడ్పీ హైస్కూల్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటాయని సతీష్‌బాబు తెలిపారు.

రోడ్ల అభివృద్ధికి పెద్దపీట

అయినవిల్లి: గ్రామీణ రహదారులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారని జెడ్పీటీసీ సభ్యుడు గన్నవరపు శ్రీనివాసరావు అన్నారు. శానపల్లిలంకలో రూ.4 లక్షల జెడ్పీ నిధులతో గ్రావెల్ రోడ్డు నిర్మాణ పనులను గురువారం ఆయన భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మట్టపర్తి నాగవిజయలక్ష్మి, సర్పంచ్ పంబల కుమారి, ఎంపీటీసీ సభ్యుడు పచ్చిమాల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణాభివృద్ధే ప్రభుత్వ అజెండా



గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే రాపాక

- ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు
- ములికిపల్లిలో గడప గడపకూ మన ప్రభుత్వం

రాజోలు: గ్రామీణాభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వ అజెండా అని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. మండలంలోని ములికిపల్లిలో గురువారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పరిపాలనలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తనదైన మార్క్ చూపిస్తున్నారని అన్నారు. భావితరాల భవిష్యత్ కోసం విద్యావ్యవస్థలో పెను మార్పులు తీసుకు వచ్చారని చెప్పారు. విద్య, వైద్యం, వ్యవసాయాభివృద్ధికి పెద్ద పీట వేశారన్నారు. రానున్న కాలంలో సీఎంగా జగన్‌మోహన్ రెడ్డినే మళ్లీ గెలిపించాలని రాపాక కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు మట్టా శైలజ, సూర్య బలిజ కార్పొరేషన్ డైరెక్టర్ కోటిపల్లి ఎస్తేరురాణి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కట్టా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో పర్యావరణ పరిరక్షణ



ఆర్గానిక్ ఎరువుల కిట్ పంపిణీ చేస్తున్న గెయిల్ అధికారులు

రాజోలు: ప్రకృతి వ్యవసాయంతో పర్యావరణ పరిరక్షణ జరుగుతుందని గెయిల్ రాజమహేంద్రవరం డీజీఎం రాజన్ అన్నారు. గెయిల్, కేర్ ఇండియా ఎన్‌జీఓ సంస్థల సంయుక్త ఆధ్వర్యాన ప్రకృతి వ్యవసాయంపై కడలి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులకు రూ.2 వేల విలువైన ఆర్గానిక్ ఎరువుల కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ చొప్పల గుణనాథ్ అధ్యక్షతన జరిగిన సదస్సులో రాజన్ మాట్లాడుతూ, ప్రకృతి వ్యవసాయం చేసే రైతుల కోసం గ్రామంలో ఒక మోడల్ ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని సిద్ధం చేస్తున్నామని చెప్పారు. దీని ద్వారా రైతులు రసాయన రహిత పంటలు పండించేందుకు వీలు కలుగుతుందని అన్నారు. భూమిలో కర్బన శాతం తగ్గిపోతోందని, ప్రకృతి వ్యవసాయం చేస్తే భూసారం పెరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో సీనియర్ హెచ్ఆర్ మేనేజర్ బాలాజీ, కేర్ ఇండియా ప్రాజెక్టు మేనేజర్ జువ్విరెడ్డి ప్రసాద్ పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం

పి.గన్నవరం: వాడ్రేవుపల్లికి చెందిన యువకుడు సిర్రా నందనకుమార్ అదృశ్యమయ్యాడు. ఎస్సై పి.గంగాభవాని కథనం ప్రకారం.. నందనకుమార్ బుధవారం తెల్లవారుజామున అంతర్వేది తీర్థానికి వెళ్లాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో తండ్రి రామ ప్రసాద్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు గురువారం కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

పూడుకుపోయిన పంట కాలువలు



గోగన్నమఠంలో గుర్రపు డెక్కతో మూసుకుపోయిన పంట కాలువ

మామిడికుదురు: గోగన్నమఠం గ్రామ పరిధిలోని నాలుగు పంట కాలువలు గుర్రపు డెక్కతో మూసుకుపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాజోలు మండలం ములికిపల్లి నుంచి వస్తున్న ఈ నాలుగు పంట కాలువలల్లో గుర్రపు డెక్క విపరీతంగా పెరిగిపోయింది. దీంతో పాటు ఆ కాలువలు పూడుకుపోవడంతో ముత్యాలపాలెం తాగునీటి ప్రాజెక్టుకు సక్రమంగా నీరందని పరిస్థితి నెలకొంది. సముద్ర తీరంలోని ఈ గ్రామంలో ఉప్పు నీరు లభ్యమవుతోంది. దీంతో పంట కాలువల ద్వారా వచ్చే నీటినే పశువులకు తాగునీటిగా కూడా వినియోగిస్తారు. పంట కాలువల ద్వారా సాగునీరు సక్రమంగా రాకపోవడంతో రైతులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై ఇరిగేషన్ అధికారులు పరిశీలించి, పూడుకుపోయిన పంట కాలువలను ఆధునీకరించాలని కోరుతున్నారు.

నత్రజని అధికంగా వాడవద్దు

అంబాజీపేట: నత్రజని అధికంగా వాడటం వల్ల వరిలో ఆకు ఎండు తెగులు, మండి పురుగు, సుడిదోమ ఆశించే అవకాశం ఉందని మండల వ్యవసాయాధికారి సీహెచ్‌డీ విజయ్‌కుమార్ అన్నారు. డాక్టర్ వైఎస్సార్ పొలంబడి కార్యక్రమంలో భాగంగా ఎరువుల యాజమాన్యంపై పుల్లేటికుర్రులో రైతులకు గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జీవన ఎరువులు ఫోస్పరస్ సోల్యుబులైజింగ్ బ్యాక్టీరియా (పీఎస్‌బీ) ఎకరానికి అర లీటరు పిచికారీ చేయాలన్నారు. ఇది భూమిలో కరగకుండా ఉండిపోయిన భాస్వరాన్ని కరిగించి, మొక్కలకు అందిస్తుందని చెప్పారు. అనంతరం రైతులకు పీఎస్‌బీ మందు అందజేశారు. కార్యక్రమంలో వీఏఏ జాబెజ్ శాస్త్రి, వీహెచ్ఏ పాండు తదితరులు పాల్గొన్నారు.

కుష్టు నివారణపై అవగాహన

ఆలమూరు: కుష్టు వ్యాధి నిర్మూలనపై చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీల పరిధిలో గురువారం అవగాహన సదస్సులు నిర్వహించారు. వైద్యాధికారులు డి.సువర్చల నాయుడు, పి.భవానీశంకర్ నేతృత్వంలో వైద్య, ఆరోగ్య సిబ్బంది ఆయా గ్రామ సచివాలయాల పరిధిలో ‘స్పర్శ – లెప్రసీ అవేర్‌నెస్ క్యాంపెయిన్’ చేపట్టారు. కుష్టు వ్యాధి లక్షణాలు తెలియజేసి, నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. మండలంలో 91 కేసులు ఉండగా, వీటిలో చొప్పెల్ల పీహెచ్‌సీ పరిధిలో 37, పెదపళ్ల పరిధిలో 54 ఉన్నాయని తెలిపారు. ఈ ఏడాది మరో అనుమానిత కేసు గుర్తించామన్నారు. సీహెచ్ఓ పి.వెంకటరత్నం, హెచ్ఈ ఏవీవీ రాజా, సర్పంచ్ కట్టా శ్రీనివాస్, సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

ముగిసిన శ్రీరామ సప్తాహ మహోత్సవం

ఆలమూరు: మండలంలోని కలవచర్లలో జరుగుతున్న శ్రీరామ సప్తాహ మహోత్సవాలు గురువారం ముగిశాయి. ఈ సందర్భంగా నిర్వహించిన ఆధ్యాత్మిక, సాంస్కృతిక, భజన కార్యక్రమాలు భక్తులను అలరించాయి. భక్తజన సందోహం కోలాహలం నడుమ దేవతమూర్తుల ఊరేగింపు జరిపారు.

కంచాలు, గ్లాసుల పంపిణీ

మలికిపురం: రామరాజులంకకు చెందిన విద్యార్థులకు ఆ గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ చొప్పల రాజశేఖర్ గురువారం కంచాలు, గ్లాసులు పంపిణీ చేశారు. గ్రామంలోని మూడు మండల పరిషత్ పాఠశాలల విద్యార్థులందరికీ ఆయన వీటిని సమకూర్చారు. రాజశేఖర్‌తోపాటు మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ నల్లి శివకుమార్ చేతుల మీదుగా వీటిని అందజేశారు. ప్రధానోపాధ్యాయులు ఐవీ ప్రసాద్, దేవ దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగావకాశాలపై 5న అవగాహన సదస్సు

కొత్తపేట: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం స్టడీ సెంటర్ పరిధిలోని స్థానిక వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రస్తుత, పూర్వ విద్యార్థులకు ఉద్యోగావకాశాలపై ఈ నెల 5న ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహిస్తున్నారు. ఆ రోజు మధ్యాహ్నం 2 గంటలకు ఈ సదస్సు జరుగుతుందని ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పెద్దిరాజు, స్టడీ సెంటర్ కో ఆర్డినేటర్ ఎస్.అరుణ్‌కుమార్ తెలిపారు. డిగ్రీ చదువుతున్న, చదివిన విద్యార్థులకు ఉద్యోగావకాశాలు, వాటిని సాధించే మార్గాలు అనే అంశంపై నిపుణులతో ఈ సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. ఇతర వివరాలకు 63056 98749, 73829 29716 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

విశ్వేశ్వరునికి ప్రత్యేక పూజలు

అంబాజీపేట: స్థానిక కొరివారి అగ్రహారంలో వేంచేసియున్న శ్రీ భువనేశ్వరీ సమేత విశ్వేశ్వరస్వామి వారి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా గురువారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో భారీ అన్నసమారాధన చేపట్టారు. స్వామి వారి కల్యాణాన్ని బుధవారం రాత్రి కన్నుల పండువగా నిర్వహించారు. విశ్వేశ్వర స్వామిని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు, ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు బూడిద వరలక్ష్మి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నాగవరపు నాగరాజు తదితరులు దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు.

పీఎం వికాస్ పథకం అభినందనీయం

రాజోలు: విశ్వకర్మకు గుర్తుగా పీఎం విశ్వకర్మ కౌశల్ సమ్మాన్ యోజన పథకం (పీఎం వికాస్) ప్రకటించిన ప్రధాని నరేంద్ర మోదీకి విశ్వకర్మ జాతీయులు రుణపడి ఉంటారని సంఘ నాయకుడు కొమ్మోజు అచ్యుత నాగేశ్వరరావు అన్నారు. విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు తాళాబత్తుల నాగేశ్వరరావు అధ్యక్షతన గురువారం తాటిపాకలో జరిగిన సమావేశంలో ప్రధాని చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కోశాధికారి కోసనా భీమశంకర తదితరులు పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు
- పసుపల్లిలో గడప గడపకూ మన ప్రభుత్వం



పసుపల్లిలో లబ్ధిదారులకు బ్రోచర్‌లను అందిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

అంబాజీపేట: సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థ ద్వారా ఎటువంటి వివక్షా లేకుండా, అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని పి.గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. పసుపల్లిలో గురువారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. గడచిన మూడున్నరేళ్లుగా ఆయా కుటుంబాలకు ఎంత మేర లబ్ధి చేకూరిందో వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పేదరిక రహిత రాష్ట్రాన్ని తయారు చేసేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఏదో ఒక సంక్షేమ పథకం ద్వారా రూ.50 వేల నుంచి రూ.8 లక్షల వరకూ లబ్ధి పొందుతున్నారని చెప్పారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అర్హులందరికీ సంక్షేమ పథకాలు నూరు శాతం అందుతున్నాయన్నారు. ఈ పథకాలన్నీ కొనసాగాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కావాలని, అందుకు అందరూ సహకరించాలని అభ్యర్థించారు. అనంతరం లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బ్రోచర్లు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, సర్పంచ్ మట్టపర్తి నాగరాజు, ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు ముత్తాబత్తుల ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలపై విస్తృత ప్రచారం

పి.గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు



సంక్షేమ పథకాల బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

మామిడికుదురు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై విస్తృత ప్రచారం నిర్వహించేందుకు కార్యాచరణ చేపట్టామని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు తెలిపారు. నగరం గ్రామంలోని తన క్యాంపు కార్యాలయం వద్ద గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సంక్షేమ పథకాలపై ప్రజల్లో చైతన్యం తీసుకు వచ్చేందుకు నియోజకవర్గంలో 2,840 మంది గృహ సారథులను, 226 మంది సచివాలయ కన్వీనర్లతో పాటు నలుగురు మండల ఇన్‌చార్జిలను నియమించామని వివరించారు. మండల ఇన్‌చార్జిలుగా జక్కంపూడి శ్రీనివాస్ (మామిడికుదురు), పులిదిండి ప్రభాకర్ (అయినవిల్లి), దొమ్మేటి దుర్గారావు (పి.గన్నవరం), దొమ్మేటి సత్య మోహన్(అంబాజీపేట)లను నియమించామని తెలిపారు. గృహ సారథులతో పాటు సచివాలయ కన్వీనర్లు, మండల ఇన్‌చార్జిలతో ఈ నెల 4వ తేదీన సమావేశాలు నిర్వహించి, సంక్షేమ పథకాలపై ఏవిధంగా ముందుకు వెళ్లాలనే అంశంపై దిశానిర్దేశం చేస్తారని చిట్టిబాబు తెలిపారు. ఈ సందర్భంగా సంక్షేమ పథకాల అమలుకు సంబంధించిన బ్రోచర్లను ఆవిష్కరించి, పార్టీ శ్రేణులకు ఎమ్మెల్యే అందజేశారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు కొమ్ముల రాము, జెడ్పీటీసీ సభ్యురాలు బూడిద వరలక్ష్మి, ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, అప్పనపల్లి దేవస్థానం చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు నెల్లి దుర్గాప్రసాద్, సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు తోలేటి బంగారు నాయుడు, పార్టీ నేతలు పాల్గొన్నారు.

రోడ్ల అభివృద్ధికి అధిక ప్రాధాన్యం

పి.గన్నవరం: రోడ్ల అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. చాకలిపాలెం – వాడ్రేవుపల్లి రోడ్డు అభివృద్ధి పనులను గురువారం ఆయన పరిశీలించారు. అధికారులతో మాట్లాడారు. రోడ్డు పనులను నాణ్యతతో త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. వైఎస్సార్ సీపీ మండల ప్రధాన కార్యదర్శి దొమ్మేటి దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు సర్పంచ్‌లకు ఉత్తమ సేవా పురస్కారాలు





ఉత్తమ సేవా పురస్కారాలు అందుకుంటున్న సర్పంచ్‌లు తమ్మన శ్రీనివాస్ (చెముడులంక), గుణ్ణం రాంబాబు (గుమ్మిలేరు)

ఆలమూరు: మండలంలోని చెముడులంక, గుమ్మిలేరు సర్పంచ్‌లు తమ్మన శ్రీనివాస్, గుణ్ణం రాంబాబు ఉత్తమ సర్పంచ్ సేవా పురస్కారాలకు ఎంపికయ్యారు. పారిశుద్ధ్య నిర్వహణలో మెరుగైన పనితీరు, నూరు శాతం పన్ను వసూళ్లు సాధించిన పంచాయతీలుగా గుర్తింపుతో పాటు గ్రామాలను అభివృద్ధిలో అగ్రగామిగా తీర్చిదిద్దినందుకు గానూ వారిని ఈ పురస్కారాలు వరించాయి. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రకటించిన ఈ అవార్డులను కలెక్టర్ హిమాన్షు శుక్లా చేతుల మీదుగా అమలాపురంలో గురువారం వారు అందుకున్నారు. సర్పంచ్‌లు తమ్మన, గుణ్ణంతో పాటు పంచాయతీ కార్యదర్శులు యు.రేణుక, డి.సుబ్బారావులను డీపీఓ కృష్ణకుమారి అభినందించారు.

విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యం



అల్లవరం సీహెచ్‌సీలో ఆరోగ్యశ్రీ హెల్ప్‌లైన్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న మంత్రి విశ్వరూప్

అల్లవరం: ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యం ఇస్తోందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. అల్లవరం కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన వైఎస్సార్ ఆరోగ్యశ్రీ హెల్ప్‌లైన్ సెంటర్‌ను ఆయన గురువారం ప్రారంభించారు. అనంతరం సీహెచ్‌సీలో సూపరింటెండెంట్ సుధీర్ ఆధ్వర్యాన జరిగిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడారు. ఈ సీహెచ్‌సీని నాడు – నేడు పథకంలో 50 పడకల ఆస్పత్రిగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. నెల రోజుల్లో ఈ ఆస్పత్రి వినియోగంలోకి వస్తుందన్నారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ సహాయ కేంద్రం ద్వారా ఆరోగ్యశ్రీ పథకం వర్తించే రోగాలు, చికిత్సలపై సలహాలు, సూచనలు ఇస్తారన్నారు. ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, జెడ్పీటీసీ కొనుకు గౌతమి, సర్పంచ్ బొమ్ము బాల వేణి, ఎంపీటీసీ మౌనిక, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కొనుకు బాపూజీ, గృహసారథుల కన్వీనర్ తిక్కా ప్రసాదు, సొసైటీ అధ్యక్షుడు యల్లమిల్లి బోసు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాలతోనే గ్రామాభివృద్ధి

ఉప్పలగుప్తం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన సచివాలయాల వ్యవస్థతో గ్రామాల అభివృద్ధి జరుగుతోందని మంత్రి విశ్వరూప్ అన్నారు. విలసవిల్లిలో సచివాలయ భవనాన్ని సర్పంచ్ సలాది ఊర్మిళాదేవి ఆధ్వర్యాన ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గతంలో ఏ సమస్య వచ్చినా మండల కేంద్రానికి వెళ్లి పడిగాపులు పడేవారని, ప్రస్తుతం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన సచివాలయాలతో గ్రామాల్లో అన్ని శాఖల ఉద్యోగులు అందుబాటులో ఉండి, ప్రజల అవసరాలను తీరుస్తున్నారని అన్నారు. ఎటువంటి సర్టిఫికెట్‌నైనా 72 గంటల్లో జారీ చేస్తున్న ఘనత సచివాలయ వ్యవస్థదేనని చెప్పారు. విలసవిల్లి గ్రామాభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయిస్తానని మంత్రి తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ దంగేటి వీర అచ్యుత జానకి, జెడ్పీటీసీ సభ్యుడు గెద్దం సంపదరావు, గ్రామ కమిటీ అధ్యక్షుడు సలాది సతీష్, వైఎస్సార్ ఉద్యానవన బోర్డు సభ్యుడు జిన్నూరి వెంకటేశ్వరరావు, పినిపే శ్రీకాంత్, ఎంపీడీఓ కేఎస్ గౌరీకుమారి, కార్యదర్శి దాసరి కృష్ణాజీ తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తతతో ప్రమాదాల నివారణ

అమలాపురం రూరల్: డ్రైవర్లందరూ అప్రమత్తతతో వాహనాలు నడపడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని జిల్లా రవాణా అధికారి అశోక్ ప్రతాప్ అన్నారు. ఏపీఎస్ ఆర్టీసీ నిర్వహిస్తున్న రహదారి భద్రతా వారోత్సవాల ముగింపు వేడుకలు గురువారం జరిగాయి. అమలాపురం ఆర్టీసీ డిపో గ్యారేజ్‌లో జిల్లా ప్రజా రవాణా అధికారి ఆర్‌వీఎస్ నాగేశ్వరరావు ఆధ్వర్యాన ఈ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో పాల్గొన్న పట్టణ ట్రాఫిక్ ఎస్సై భద్రరాజు మాట్లాడుతూ, డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలను తప్పక పాటించాలని అన్నారు. కిమ్స్ మెడికల్ ఆఫీసర్ పీఎస్ శర్మ మాట్లాడుతూ, డ్రైవర్లు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. జిల్లా స్థాయిలో ముగ్గురు ఉత్తమ యాక్సిడెంట్ ఫ్రీ డ్రైవర్లకు, డిపో స్థాయిలో 12 మంది ఉత్తమ యాక్సిడెంట్ ఫ్రీ డ్రైవర్లకు ప్రశంసా పత్రాలు అందజేశారు. చిత్రలేఖనం పోటీల్లో 20 మంది విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో పర్సనల్ ఆఫీసర్ ఎన్వై ప్రసాద్, అమలాపురం, రాజోలు, రావులపాలెం డిపో మేనేజర్లు చల్లా సత్యనారాయణమూర్తి, భాస్కరరావు, కేడీఎంఎస్ కుమార్ పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

రావులపాలెం: లైన్ల మరమ్మతుల కారణంగా రావులపాలెం సబ్‌స్టేషన్ పరిధిలోని అన్ని ఫీడర్లకూ శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నారు. ఈ విషయాన్ని ఈపీడీసీఎల్ అమలాపురం ఈఈ ఎం.రవికుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రావులపాలెం, కొమరాజులంక, రావులపాడు తదితర గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

అయినవిల్లి: ముక్తేశ్వరం సెంటర్‌లో 33/11 కేవీ విద్యుత్ స్తంభాలను ఎత్తు చేసేందుకు గానూ శుక్రవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు రవికుమార్ తెలిపారు. ముక్తేశ్వరం ఫీడర్ పరిధిలోని వీరవల్లిపాలెం, మూలపాలెం ఫీడర్ పరిధిలోని అయినవిల్లి, ముక్తేశ్వరం, తొత్తరమూడి, వీరవల్లిపాలెం, అయినవిల్లిలంక గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపేస్తామని వివరించారు.

వాటర్ ట్యాంకు నిర్మాణానికి భూమిపూజ

మామిడికుదురు: జల్ జీవన్ మిషన్ నిధులు రూ.27.94 లక్షలతో పాశర్లపూడిలంక పంచాయతీ చెరువు గట్టు వద్ద కొత్తగా నిర్మించనున్న వాటర్ ట్యాంకు పనులకు సర్పంచ్ తెలగారెడ్డి సూర్యప్రకాశరావు గురువారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జల్ జీవన్ మిషన్ నిధులతో గ్రామంలో రెండు కొత్త ట్యాంకుల నిర్మాణానికి, ప్రతి ఇంటికీ తాగునీరు అందించేందుకు నిధులు మంజూరయ్యాయని చెప్పారు. త్వరలోనే పనులను పూర్తి చేయించి, ప్రతి ఆవాస ప్రాంతానికీ తాగునీరు అందిస్తామని తెలిపారు.

మక్కా యాత్రకు బయలుదేరిన ముస్లింలు



మక్కా సందర్శనకు బయలుదేరిన ముస్లింలు

మామిడికుదురు: తమ పవిత్ర పుణ్యక్షేత్రాలైన మక్కా, మదీనాల సందర్శనకు ముస్లింల బృందం గురువారం నగరం నుంచి బయలుదేరి వెళ్లింది. ఈ బృందం సభ్యులు మత ప్రబోధకులు సయ్యద్ అబ్బాస్ బాఖరి ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో ముస్తఫా హైదర్, దురాబ్ హుస్సేన్, ఆఫ్తాబ్ హైదర్, గులామ్ అబ్బాస్ పాల్గొన్నారు.

భవిత విద్యార్థులకు హైజీన్ కిట్లు

పి.గన్నవరం: పారా సంస్థ ప్రతినిధులు గురువారం స్థానిక భవిత కేంద్రాన్ని సందర్శించారు. చాయ్–మిస్సిమో ఆర్థిక సహకారంతో భవిత విద్యార్థులకు కోవిడ్–19 ఎమర్జెన్సీ హైజీన్ కిట్లు అందజేశారు. కరోనాపై పారా సంస్థ కో ఆర్డినేటర్ బడుగు సుబ్బాయమ్మ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆస్ట్రియా దేశానికి చెందిన రిటైర్డ్ స్పెషల్ టీచర్లు గగ్రిఫెడ్, గర్టిల్డ్ , సీబీఆర్ మహిమరావు, ఎంఈఓ కోన హెలీనా, హెచ్ఎం డి.ప్రసాద్, సమగ్రశిక్ష ఐఈ కో ఆర్డినేటర్ ఎంవీవీ సత్యనారాయణ, స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ పి.సత్యనారాయణ, ఐఈఆర్టీ కె.సత్యనారాయణ, సీఆర్పీలు పాల్గొన్నారు.

అపరాధ రుసుం తీర ప్రాంతాలకు ఇవ్వాలి

మలికిపురం: పర్యావరణ పరిరక్షణ నిమిత్తం ఓఎన్‌జీసీకి నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ విధించిన రూ.22 కోట్ల పైబడి నిధులను రాజోలు దీవిలోని సముద్ర తీర ప్రాంత గ్రామాలకు ఖర్చు చేయాలని మానవ హక్కుల వేదిక జిల్లా నాయకుడు ముత్యాల శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఓఎన్‌జీసీ కార్యకలాపాల కారణంగా రాజోలు నియోజకవర్గంలోని సముద్ర తీర ప్రాంతాలు ఘోరంగా దెబ్బ తిన్నాయని గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

బీమా సాయం పంపిణీ

మలికిపురం: చింతలమోరి గ్రామంలో ఇటీవల మృతి చెందిన రాపాక డేవిడ్‌రాజు కుటుంబానికి రూ.10 వేల వైఎస్సార్ బీమా మంజూరైంది. ఈ మొత్తాన్ని వారికి రాజోలు ఎమ్మెలే రాపాక వరప్రసాదరావు గురువారం అందజేశారు. ఎంపీటీసీ సభ్యుడు తోట రాజేష్, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

10 నుంచి సభ్యత్వ నమోదు

పి.గన్నవరం: ఈ నెల 10 నుంచి తమ పార్టీ క్రియాశీల సభ్యత్వాల నమోదు నిర్వహిస్తామని జనసేన ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కందుల దుర్గేష్ తెలిపారు. యర్రంశెట్టివారిపాలెం వీరభద్రస్వామి ఆలయంలో గురువారం ఆయన ప్రత్యేక పూజలు చేశారు. పార్టీ నాయకులు డీఎంఆర్ శేఖర్, పితాని బాలకృష్ణ పాల్గొన్నారు.